
క్రైన్ కథోత్సవం - 2006 కథల పోటీలో
సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ



# పరధర్మం

యర్రమిల్లి విజయలక్ష్మి

'**మా** అమ్మ విషయమే బొత్తిగా అర్థం కావటం లేదు. వసూ ! ఏమనుకోవాలో తెలియటంలేదు. ఈ వయసులో ఇదేం పని... నలుగురిలో మన పరువు, ప్రతిష్ఠ ఏం కావాలి...'

'ఇందులో అర్థం కావటానికేం వుంది?.... మీ నాన్నగారి మెతకతనమే ఇంతకూ కారణం... పోనీ ఆయన సరే...! మీరు నలుగురూ అన్నా మాట్లాడి బుద్ధి చెప్పచ్చుగా... పరువు - ప్రతిష్ఠ అని బాధపడుతూ కూర్చోకపోతే'.... వసంత వ్యంగ్యంగా నవ్వింది.

'చెప్పటం లేదా ! వింటే కదా... బ్రహ్మ రుద్రాదులు అడ్డొచ్చినా తన నిర్ణయం మారదని పట్టుపట్టి కూర్చుంది. అమ్మ ఇంత మొండిదని నాకు ఇంతవరకు తెలియదు సుమా.'

తల్లి పట్టుదలకు ఆశ్చర్యపోతున్నాడో - ప్రసంశిస్తున్నాడో తెలియని విధంగా అన్నాడు. 'ఏమన్నా పెద్ద సమస్య తెచ్చిపెట్టింది.

సుమంత్‌లాగే అతని అన్నలిద్దరు వాళ్ళ భార్యలు, అక్కలు, బావలు, కుటుంబపెద్ద - మూడు తరాలకు మూల స్థంబమై అరవయ్యో వడిలో పడిన కామేశ్వరి ప్రస్తుత తీరు అర్థం చేసుకోలేక ఎవరికి వారు లోలోపల మల్ల గుల్లాలు పడుతున్నారు. ఏ ఇద్దరు మాట్లాడు కుంటున్నా ఇదే ప్రదానాంశంగా వుంది. ఇక ఇంటి యజమాని.... డెబ్బయ్యోవడిలో అడుగు పెట్టిన ఉమామహేశ్వరం పరిస్థితి మరి అయో మయంగా వుంది. నలభైయేళ్ళుగా తన అర్ధాంగిగా తు.చ. తప్పకుండా పరమ పవిత్ర మైన అంకిత భావంతో తనను వినయ విధేయ తలతో అనుసరిస్తూ వస్తున్న భార్య ఒక్కసారిగా, హెచ్చరిక లేకుండా ఆకస్మాత్తుగా వెన్నుపోటు పొడిచిందేమిటాని...! 'సరే నండి... అలాగే నండి... మీ ఇష్టమండి...' అనటం తప్ప ఏ సందర్భంలోనూ తనను వ్యతిరేకించి ఎరుగని సహధర్మచారిణి చాపక్రింది నీరులా స్తబ్దంగా ఉండి ఉండి ఒక్కసారిగా ఉప్పెనలా విరుచుకు పడిందేమిటాని ఆశ్చర్యంతో, కోపంతో, అంతకు మించిన అవమానభారంతో లోలోపల అతలా కుతలమై పోతున్నాడు. 'దీనికి పోయేకాలం వచ్చిందిరా!... ఏమన్న ఛావనీయండి... ఇంత జరిగాక ఇంకా అది నా పెళ్ళామేమిటి?!...' అని సహజసిద్ధమైన అహంకారంతో ఉక్రోష, కావేషాలతో రెచ్చిపోతున్నాడు. మనుమల్నెత్తిన ఈ వయసులో ఆవిడగారు తీసుకున్న నిర్ణయం ఆయన్ని తీవ్రమైన క్షోభకు గురిచేసింది.' తనేం లోటు చేసాడు ! పద్దెనిమిదో ఏట కట్టుకున్న పుట్నించి దేనికి లోటు చేయలేదు. దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగినా పట్టు దలతో చదువులోను - తరువాత ఉద్యోగం లోను ఎదిగాడు. కాలానుగుణంగా పిల్లలకు మంచి చదువులు కొని పెట్టాడు. శక్తిమేరకు ఇల్లు, వాకిలి, డబ్బు, దస్కం ఏర్పరుచుకొని ముందు ముందు దిగులులేని జీవితం అమ ర్చాడు. ఇదంతా చెప్పినంత తేలిగ్గా అదృష్ట వశాన ఏదో అద్భుతంలా జరిగింది కాదు. ముప్పై, ముప్పై ఐదు సం॥లు అహర్నిశలూ దీక్షగా కృషిచేస్తే వచ్చింది. దైవాన్నో అదృశ్యంగా వుందో లేదో తెలియని అదృష్టాన్నో ఎప్పుడూ నమ్ముకోలేదు. భౌతిక సంపద పెంచుకోవాలంటే లౌకికంగానే పోవాలనుకున్నాడు. ఈ లోకంలో అనుకున్న పనులు సాధించుకోవాలంటే గుళ్ళు-గోపురాలు తిరిగి ప్రార్థనలు మొక్కులు... ఉన్నాడో లేడో ఎరుగని దేవునికి నివేదనలు కాక స్వయంకృషిని మాత్రమే ఆశ్రయించాలన్న వాదం ఆయనిది. 'నువ్వు రిటైరయ్యావు. ఇంక కుర్చీ వదిలి ఇంట్లో విశ్రాంతి తీసుకోమని యాజమాన్యం ఇంటికి పంపినా ఆయన విశ్రాంతి తీసుకోలేదు. రిటైర్‌మెంటు బెనిఫిట్స్‌తో, నిలవధనంతో బ్యాంకులోను సంపాదించి ఇంగ్లీషు మీడియం కాన్వెంట్ పెట్టాడు.

'ఇంకా ఎందుకు మీకీ శ్రమ...! హాయిగా 'కృష్ణా... రామా' అనుకుంటూ విశ్రాంతి తీసుకోక... కాన్వెంటు నిర్వహించట మంటే మాటలా...ఎంత శ్రమ పడాలి...!' అని తన ధోరణిలో సున్నితంగా చెప్పింది కామేశ్వరి. 'విద్యారంగంలో ఇన్ని సం॥రాల అనుభవం ఉంది. ఆ మాత్రం నాకు తెలియదా.. అన్నింటికీ అపశకునాలు పలక్కు.. రిటైరైనంత మాత్రాన కాటికి కాళ్ళు చాపుకున్నాననుకున్నావా. కృష్ణా.. రామా' అనుకుంటూ ఆ మూలగదిలో పడి వుండటానికి... బుర్రలో తెలివి... ఒంట్లో ఓపిక బాగానే వున్నాయి' అని ఆవిడనోరు మూయించాడు. ఒక యజమాని క్రింద పని చేయటం వేరు... తనే యజమానిగా మారటం వేరు. ఇక ఉమామహేశ్వరం తాపత్రయం మరీ వ్యక్తిగతమైంది. 24గం॥లు చాలటం లేదు. 64గం॥ల వేగంతో పరుగులు తీయాల్సి వస్తోంది. తనచుట్టూ వేగం... పోటీ.. విశాల మైన భవనం, ఆటస్థలం, ఈతకొలను, గార్డెన్, కేరళ టీచర్స్ ఇద్దరు, ముగ్గురు, దిగువ తరగతుల కోసం కనిష్ఠ వేతనాలతో స్థానిక నిరుద్యోగ పట్ట భద్రయువతుల నియామకం..వగైరా.. వగైరా... అనుమతిపొంది రంగంలోకి దిగి కాస్త నిలదొక్కు కునే సరికి రెండు సం॥లు పట్టింది.

'ఇంతకాలం ఈయన ఉద్యోగ బాధ్య తలతోను, బదిలీలతోను, గడిచిపోయింది. ఉద్యోగ బాధ్యత ఆయనదైతే అంతకన్నా గురు తరమైన భర్తగారి బాధ్యత తనదిగా అంటి పెట్టుకుని తిరిగింది. సర్వీసు మొత్తంలో బదిలీల నిమిత్తం ఆయన గోచి అంచుచ్చుకుని ఏడెనిమిది తూర్పు-పడమరలు లేని కుగ్రామాలలో అరణ్య వాసం చేసింది. అందుకు తనేమీ బాధపడలేదు. అది తన కర్తవ్యం అనుకుంది. ఆయనది

## నీలగిరి పిట్ట

జలజల రాలే ఆకుల్లా
అది నేలనుకుందో ఏమో
అలసి ఉన్న భుజాలమీద
అలవోకగా వాలింది.

పూల లోయ మీద
పుప్పొళ్ళ మేఘమై
వేయి పండ్ల వానను
రోజూ కురిపిస్తుంది.

ఎదురు చూసినంత సేపు కూడ
కళ్ళెదురుగా ఉండని
బ్రహ్మ కమలమై పోతుందని బెంగ పడే
నా బతుకు పుటల్లో
కురింజిలా ఉండిపోతానని
చెప్పకనే చెబుతోంది.

తడి ఆరని మంచు మీద
తన శ్వాసను కురిపించి
నన్ను వేసవి గంగను చేసి
జీవనదిగా మార్చుతోంది.

మంచు బరువు మోసుకుంటూ
అక్కడే నిలబడిపోయిన
పర్వత సానువుల్నీ
శిఖరాలను తన ముక్కుతో పలకరించి
కరిగిస్తూ మంచంటూ
ఊపిరి సలపని ఉద్వేగానికి రెక్కలొచ్చిన
పువ్వది.
సువాసన రెక్కలతో
ఎగురుతున్న పిట్టది.

- విద్యాసాగర్ అంగళకుర్తి

ఉద్యోగధర్మం.... తనది ఆ ధర్మాన్ని అనుసరించటం... మరి సహధర్మ చారిణి అంటే అదే కదా!' అని సరిపెట్టుకుంది.

'తనీ నిర్ణయం తీసుకోక తప్పలేదు. అది అందరినీ బాధిస్తోంది. ఏ ఒక్కరూ తన్ని అమోదించటం లేదు సరికదా... తనేదో వాళ్ళందరికి ద్రోహం తలపెట్టినట్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. చిన్నా, పెద్దా, ఎవరూ తనతో సరిగా మాట్లాడటం లేదు. తనే పలకరిస్తే... 'ఇంకా నీకు మాతో పనేమిటన్నట్లు' నిర్లిప్తంగా 'ఊ..ఆ' లతో సరిపెడుతున్నారు. ఆరోజు 'ఓసి ద్రాష్టురాలా...ఎంతపని చేసావ్...నన్నిలా రోడ్డున పడేయటానికి నీకు నేనేం ద్రోహం చేసానే పాపిష్టిదానా... ఇంతకన్నా నువ్వు చచ్చినా ఆనందించేవాడ్ని కదే'...! అని తిప్పుకోలేని కోపంతో విరుచుకు పడిందగ్గర్నించి మాట, పలుకు, సంగతి సరే... తన ముఖం కూడా చూడటం లేదాయన. కోడళ్లు వంటగది స్వాధీనంచేసుకుని వండి, వడ్డిస్తున్నారు. చిన్న చిన్నతాతగారి అవసరాలు మనవలు చూస్తున్నారు. ఎప్పుడో ఆకలికింత కతికి కృష్ణ మందిరంలో కాలం గడుపుతోంది. మనసంతా అశాంతిగా వుండి ధ్యానం కూడా సరిగా కుదరటం లేదు. వ్యక్తం తెలిసాక గడిచిన నలభై సం॥ల జీవితం ముక్కలు ముక్కలుగా మదిలో కదులుతోంది.

'బాగా ఆలోచించుకో బామ్మా...! ఇదంత తేలికైన విషయం కాదు'... అంది సుధ తను చెప్పిందంతా విని.

'ఇలా ఆలోచన జరుగుతుంటే తన మనసూ మెత్తబడిపోతుందేమో.... విసురుడు రాయిలా ఇన్నేళ్ళు మరో ప్రపంచం తెలియకుండా గడిపింది. చివరికీ ఇరుకులోనే వీళ్ళ ఏడుపులు, మొత్తుకోళ్ళ మధ్యే, వెల్లమారిపోతుందేమో తనువు...! దేవుడా ! నా మనసుకు గట్టితనాన్ని... ఈ చివరిరోజులలోనన్నా నన్ను నేను ఉద్దరించుకునే అవకాశాన్నివ్వు...' అని మఠంలో కృష్ణ విగ్రహం ముందు కూర్చుని గంటల తరబడి ప్రార్థిస్తోంది. ధ్యాస నిలవక మనసు చంచలమై – మళ్ళీ, మళ్ళీ గత జీవితాన్ని గుర్తు చేస్తుంది.

❖ ❖ ❖


కామేశ్వరికి చేతులు, కాళ్ళు కట్టేసినట్లు ఇరుకిరుగ్గా వుంది. నిలువనీయని ఆరాటం, చెప్పలేని దిగులు... మనసంతా ఉక్కిరి, బిక్కిరిగా వుంది. మూణ్నెళ్ళైంది. ఇల్లు విడిచి పెద్దకొడుకు దగ్గరకు వచ్చి...! ఇక ఆవిడ మనసక్కడ నిలవటం లేదు. అగ్రహారంలో ఇంటి మీదకు గాలి మళ్ళింది. వండుకోవటం, తినటం, ఇల్లు సర్దుకోవటం, పిల్లల్ని సముదాయించుకోవటం.. ఇదే కార్యక్రమంగా వుంది. ఓ పూజ లేదు... పురస్కారం లేదు. జపం లేదు... తపం లేదు. ఉన్నగోడు చెడినట్లు ఇంత వయసు వచ్చీ మళ్ళీ అదే లంపటం..! అప్పుడు తన పిల్లలు, ఇప్పుడు పిల్లల పిల్లలు. ఉద్యోగబాధ్యత తీరింది కదా... కాస్త కాలు, చెయ్యి, ఆడినప్పుడే నాలుగు పుణ్యక్షేత్రాలు దర్శించుకోవాలని ఆశపడింది.. చిన్న చిన్న యాత్రలు తప్ప, చెప్పుకో తగ్గ ఘట్టి యాత్ర ఒక్కటి చెయ్యలేదు. జన్మకోసారైన కాశీ యాత్ర చేసి గంగలో మునిగి విశ్వేశ్వరుని దర్శించుకుంటే ఉత్తమగతులు వుంటాయంటారు. ఎన్నేళ్ళనుంచో అనుకుంటోంది. ఏడాదేడాది అనంతంగారు యాత్రా స్పెషల్ వేస్తారు. ఊళ్ళో ఎంతోమంది టిక్కెట్లు తీసుకొని పుణ్యక్షేత్రాలన్నీ తిరిగి వస్తారు. తనకు మాత్రం ఎప్పుడూ గడప దాటడానికే కుదరదు. 'తొందరేం...! వెళ్ళచ్చులే... ముందు ఇవన్నీ గట్టెక్కనియ్యి..!' అంటారు. పాతికేళ్ళ వరకు మొయ్యటం. కనటం... నలభైఏళ్ళ వరకు సాకటం, చదివించటం... ఆపైన పెళ్ళిళ్లు, పేరంటాలు.. ఒకరి తరువాత ఒకరికి పురుళ్ళు, పుణ్యాలు... వాళ్ళకవసరం పడినప్పుడు సహాయంకోసం వెళ్ళి, అక్కర తీర్చిరావటం.. మధ్యలో ఈయన గారి ధనేషణ.. ఈషణ త్రయం..! యాత్రల సంగతి దేవుడెరుగు.... కన్నతల్లి లాంటి గోదావరి ఒడి నుంచి కూడా ఇంతదూరం రావల్సి వచ్చింది.

'ఖర్చులన్నీ వాడే పెట్టుకుంటాడు అవసరానికి మనమా మాత్రం సాయం చేయక పోతే ఎట్లా... ఎంత ఆర్నెల్లేగా... నీ మఠం గోదావరి ఎక్కడికి పోవులే'!

'అవెప్పుడూ ఎక్కడికి పోవు ! సమయమైతే పోయేది మనమే!'అనుకుంది మనసులో..! అది కాదు... అనంతంగారి యాత్ర స్పెషల్ అని సణిగింది. ఆ మాత్రం ఎదురు మాట్లాడటం కూడా అరుదే. !

'యాత్రలదేముందే...! ఎప్పుడైనా వెళ్ళొచ్చు... ముందు వాళ్ళ అవసరం చూడాలి మనం. పిల్లలు కదా ! పాపం... వనజకు ఉద్యోగం కూడాను'.

'అసలు కంటే వడ్డీ ముద్దని ఈయనకి అల్లుడు, కోడళ్ళంటే అపరిమితమైన శ్రద్ధ...! అల్లుడుగారు హైదరాబాద్‌లో వుండి కాన్వెంటుకు సంబంధించినసమస్యలన్నీ సమర్థించుకు వస్తారు. అమెరికాలో వున్న అబ్బాయి ఆర్థికంగా కాచుకొస్తున్నాడు. కేంద్రంలో విద్యాశాఖలో పనిచేస్తున్న రెండోవాడూ అంతే...! ఇందు



జులై 1వతేదీ ఆదివారం అనకాపల్లి లాఫింగ్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన 'నవ్వులజల్లు' కార్యక్రమంలో భాగంగా క్లబ్‌సభ్యులు బి.గంగాధర్ & ఎ.పాండరేలు ఈ టీ.వి "స్మైల్ రాజా స్మైల్" కార్యక్రమానికి ఎంపిక అయి పాల్గొన్నందుకు లాఫింగ్ క్లబ్ సభ్యులు బుద్ధ శ్రీనివాసరావు, ఎస్.ఎఫ్.ఎమ్ బాబాయ్ దాడి త్రినాధస్వామి, మళ్ళ భువనేశ్వరరావు, వినకోట బుచ్చిబాబు, ముఖ్యఅతిథులు డా॥కె.విష్ణుమూర్తి, శ్రీమతి డా॥కె.వి. సత్యవతి గార్ల సమక్షంలో సత్కరిస్తున్న దృశ్యం.

నిమిత్తం కూడా అవసరానికి మించి వాళ్ళం దరికి తమ సహాయ, సహకారాలు అందివ్వా లని ఈయనగారి తాపత్రయం.... మధ్య ఏళ్ళు, పూళ్ళు ముగ్గురి అవసరాలకు తను సరఫరా చేయబడుతుంది. ఆదిలో పిల్లలు చిన్నవాళ్ళుగా వుండి - తమ చేయూత, అవసరం తప్పని సరైనప్పుడు, తమ ధర్మాన్ని ఆనందంగానే నిర్వర్తించింది. ఇప్పుడు వాళ్ళకు నడక కాదు.... పరుగు తీయటం వచ్చింది. రేసులో ముందు నిలవాలన్న ఆరాటంలో పరుగు తీయటం...! రెక్కలు వచ్చిన పక్షుల్లా, దూరతీరాలకు విహంగ యానం చేస్తున్నారు. ఆ ఆరాటంలో మన సంస్కృతి, సంప్రదాయం, పట్టటం లేదు. పెద్ద వాళ్ళు, వాళ్ళ ఆశలు... మనోభావాలు లెక్క చేయటం లేదు. 'నీలా ఆలోచిస్తే అయినట్టే...! పాత చింతకాయ జాడీలా బూజుపట్టి వందకి, వెయ్యికి వెట్టి చేసుకుంటూ ఇక్కడే పడి ఉండాలి! కాలానికి తగ్గట్టు మన అభిప్రాయాలు మార్చు కోవాలి. ఏళ్ళ తరబడి ఈ పనికిమాలిన ఊళ్ళో రాటై పోయి నీకు ప్రపంచం ఎంత ఎదిగి పోయిందో తెలియటం లేదు....!'

'ఎదిగిపోయింది మీర్రా' అనుకొని సరిపెట్టుకుంది. భర్తకి కాని, పిల్లల్లో ఏ ఒక్కరికి గాని తన ఆలోచన లేదని అర్థమైపోయింది. అయినా తన అదృష్టం... ఆయన ఉద్యోగరీత్యా గోదావరి జిల్లాలోనే దగ్గర, దగ్గర ఊళ్ళలో పనిచేస్తూ ఉండిపోవటం వలన తన ప్రాణప్రద మైన ఊరిని, జీవితంలో జీవమైన సొంత ఇంటిని వదిలిపోవలసిన గతి పట్టలేదు. 'ఇద్దరం పెద్దవాళ్ళ మవుతున్నాం..! మీరు రిటైరయ్యారు ఇక మన కోసం మనం బ్రతకాలి. ఈ జన్మ ఇంకెంత కాలవెూ...! దీవముండ గానే తరుణోపాయం వెతుక్కో వాలి'... అంది. రిటైర్ కావటానికి ముందే ఆయన భౌతిక సంపద ఇంకా పెంచుకుని లౌకికంలో మరీ మరీ కూరుకు పోవాలని సంకల్పించుకొన్నారని తనకేం తెలుసు...?! గుంజకు కట్టేసిన ఆవులా భర్త, పిల్లలు, వాళ్ళ ఆలన, పాలన, సేవ వీటి చుట్టే తన జీవితం తిరుగుతోంది. వయసైపోతోంది. వార్ధక్యం మీద పడింది. తాపత్రయాలు మాత్రం అయిపోవటం లేదు. ఎప్పటికప్పుడు లంప టంలో కూరుకుపోవటమే తప్ప బయట పడద మంటూ వున్నట్టు లేదు. !

'అప్పుడే తొందరంటారేమిటి...? మనమేమన్నా చిన్నవాళ్ళమా... మన్ని మనం ఉద్ధరించుకునే ప్రయత్నం ఇప్పుడన్నా చేయక పోతే ఎట్లా...! ఇంకా సంపాదించాలన్న ఆరాటం ఎందుకు. మనిద్దరం ఉన్నదాంతో బ్రతకలేకపోతామా? పిల్లల్ని మనం పెంచాం. అది మనధర్మం... వాళ్ళ పిల్లల బాధ్యత వాళ్ళే చూసుకుంటారు..ఇల్లా మమకారాలు పెంచుకు పోవటం మంచిది కాదు...!' ఆవిడ ఎంత చెప్పినా వినేదెవరు..? అలులు ఆగాక స్నానం చేద్దామంటాడు. కుటుంబ సంక్షేమం కోసం - పిల్లల ఆయురారోగ్యాల కోసం తన పసుపు కుంకుమలకోసం అప్పుడప్పుడు పూజలు, మొక్కు బడులు...అర్చనలు, ఆరాధనలు,అంతే ! తాడు తెంచుకునన్నా ఆ ఇరుకిరుకు సంసార కూపం లోంచి బయటపడాలని ఆమె మనసు ఆరాట పడుతోంది. ఎల్లాగో పళ్ళ బిగువున అమెరికాలో వాళ్ళ అవసరం గడిపి వచ్చిందో లేదో.... కూతురు రెడీ..! ఇక ఈ బతుకింతే నన్న నిస్పృహ ఆవిడ మనసుని ఆవరించింది. జీవితకాల శిక్ష పడిన నేరస్తుడికైనా విడుదల లభిస్తుంది. కాన ఈ సంసార చెరసాల నుండి తనకు విముక్తి లేదనుకున్నప్పుడు మనసులో దిగులు మరింత పెరిగిపోతోంది.

'...దుర్లభమైన మానవజన్మ ఏ పుణ్య వశానో లభించింది. దీన్ని సద్వినియోగం చేసు కోవాలి. ఊబి అని తెలియక మృగాలు కూరుకు పోయినట్లు మనమూ ఇందులో కూరుకు పోయాం. బయటపడాలి. జన్మరాహిత్యానికి శాస్త్రాలు చెప్పినట్లు కర్మసన్యాస యోగం మనకు సాధ్యం కాకపోయినా కొంతైనా ఆత్మోద్ధరణకు ప్రయత్నించాలి. పుట్టటం, గిట్టటం అనే జన్మ చక్ర పరిభ్రమణంలోంచి బయట పడాలి. ఇక ఈ సంసారబంధాలు తెంచుకుని మనకోసం మనం బతుకుదాం.' ఈ రకమైన అర్థం వచ్చే మాటలు ఆవిడ ఉమామహేశ్వరానికి ఎన్నో సార్లు చెప్పింది. 'నువ్వు చేస్తున్నావుగా.. పూజలు, వ్రతాలు... ఆ పుణ్యమంతా నీదనుకుంటున్నా వేమిటి?... అది దక్కేదంతా నాకే... సొమ్మొక డిది, సోకొకడిదని... కష్టం నీది- ఫలం నాది.. నన్ను మాత్రం సన్యాసిని చెయ్యకు...! అది మన వంటికి షడదు...' అది ఆయన సమాధానం ! అసలావిడ తపన ఆయనకొక విషయంగా పట్టించుకోవలసిందిగా, అర్థం చేసుకుని సహక రించవలసిందిగా అనిపించలేదు. 'మంచైనా, చెడైనా ఎవరు చేసిన కర్మఫలం వాళ్ళే అనుభ వించాలి. వందమంది పరివార మున్నా... కోట్ల సంపద వున్నా... మనిషికి చివరికి ఎందుకు పనికిరావు. ఎవరికి వారే... పదండి... వంట్లో, సత్తువ, చేతిలో డబ్బులు వున్నప్పుడే నాలుగు పుణ్యక్షేత్రాలు చూసి తెలుసుకుందాం' తన మాట చెల్లకపోయినా ఆవిడ ఆయన్ని సతాయిస్తూనే ఉంది.

'జననీ - జన్మభూమి'.. అన్నారు. అమెరికా నుంచి బయటపడాక స్వర్గంలోకి వచ్చి నట్టుంది ఆవిడ మనసుకి. గోదావరి స్నానాలు, దేవాలయ దర్శనాలు... పురాణ కాలక్షేపాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సత్సంగాలు...... యాంత్రికంగా ఇంట్లో వాళ్ళ అవసరాలు చూస్తూనే తనమార్గంలో సాగాలని ఆవిడ తపన.

అమ్మాయి నుంచి పిలుపు రావటంతో స్థిమిత పడుతున్న మనసులో మళ్ళీ అలజడి రేగింది. 'మా అత్తగారు కూతురి డెలివరీకి వెళ్ళింది... ముంచుకుపోయినట్టు కూతురు చేసుకోలేదంటూ మూణ్నెల్ల ముందరే...! ఆర్నెళ్ళ వరకూ రాదు. ఈ పిల్లవెధవలతో వేగలేకపోతు న్నాను. ఉద్యోగం ఒకటి నా ప్రాణానికి...! ఆవి దుంటే ఇంటిపట్టునఉండి కాస్తఆనరాగా ఉండేది. అమ్మని పంపండి నాన్నా...... మా అత్తగారు వచ్చాక పంపేస్తాను... ఖాళీయేగా అమ్మ...!'

'ఎప్పుడు బయల్దేరతావు... టికెట్టు రిజర్వు చేస్తాను'

'పుష్కరాలొస్తున్నాయి. నదీస్నానాలకని తెలిసినవాళ్ళూ,బంధువులూ ఎవరెవరో వస్తారు. నేనింట్లో లేకపోతే ఎలా.... పుణ్యదినాల్లో ఎక్కడెక్కడివాళ్ళు నదీస్నానాలు చేయాలని వస్తూంటే... నేను ఊరొదిలి వెళ్ళటమేమిటి..! కుదరదు'. వాదన మొదలు. ఆయన వెళ్ళా

లని... ఈవిడ వెళ్ళనని...! కూతురు అలిగింది 'నీకు నాకంటే గోదావరి స్నానాలు ఎక్కువా... తల్లి అన్నాక పిల్లల అవసరాలకి ఆదుకోవాలి కాని ! మా అత్తగారు చూడు. కూతురంటే ఎంత ప్రేమో 'ఊ' అంటే వాలిపోతుంది..'

ఈ అలక అల్లుడికి సోకితే తన పనులు పాడవుతాయని ఉమామహేశ్వరం బాధ. 'స్కూలికి అతని సహకారం ఎప్పుడూ అవసరం... ఒకరికొకరు పరస్పరం సహకరించుకుంటూ పోవాలి కాని..వెళ్ళు' అని ఆదేశించాడు.

కామేశ్వరమ్మ కూతురి దగ్గరికెళ్ళలేదు. లాయరు సుధ దగ్గరికి వెళ్ళింది. సుధ పుట్టుకల నాటి నుండి ఆవిడకి తెలుసు. కళ్ళముందే పెరిగింది. అరమరికలు లేకుండా తన బాధంతా వివరించి...'అమ్మాయి సుధా..! నా ధర్మం నన్ను నిర్వర్తించుకోనీయని ఈ సంసారం నాకొద్దు.... మీ తాతగారికి విడాకులివ్వాలనుకుంటున్నాను. సాయం చెయ్యి..' అంది. సుధ తెల్లబోయింది. భర్తల మూలంగా యాతనలు పడుతున్న భార్యలందరి కేసులు తను పరిష్కరించింది. అనివార్యమైనపరిస్థితుల్లో విడాకులూ ఇప్పించింది. తాగుబోతని, హింసిస్తాడని కట్నం కోసం చిత్రహింసల పాల్చేస్తున్నాడని, శాడిస్టని ఏవేవో కారణాల వల్ల కొందరు భర్తల నుండి విడిపోవాలని కోరుకుంటారు. ఈ కేసు కొత్తగా, వింతగా అనిపించింది. మనిషిని తన అంతరంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించమని ఒత్తిడి చేయటం, కనపడని, మానసిక ఘర్షణకు, ఒత్తిడికి గురి చేయటం భారతీయ శిక్షాస్మృతి ప్రకారం ఏ రకమైన నేరం కింద వస్తుందో పరిశీలించింది. ఇతరులకు హాని కలిగించకుండా, స్వధర్మాన్ని రక్షించమంటూ స్వేచ్ఛగా జీవించే హక్కు చట్టం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కుగా వాదించాలని నిర్ణయించుకుని ఆవిడ తరఫున కేసు ఒప్పుకుంది.

తీర్పు రోజు కోర్టు కిక్కిరిసిపోయింది.

ధర్మ సూక్ష్మమెంత నిగూఢమైనదో గ్రహించలేని ఉమామహేశ్వరం కోర్టు భార్యకు విడాకులు మంజూరు చేయటానికి తగిన కార్య, కారణాలేమీ లేవని.. తను నిర్దోషిననీ ధైర్యంగా ఉన్నాడు.

'హిందువులందరకూ పవిత్రమైనది - ప్రామాణికమైనది కావుననే న్యాయస్థానాల్లో అనృతం పలకనని భగవద్గీతమీద ప్రమాణం చేయిస్తారు. ఆ గీతా శాస్త్రం ఆధారంగానే ఈ వింత కేసుకు నేను తీర్పు చెప్పదలచుకున్నాను. స్వమతాన్ని, స్వధర్మాన్ని ఆచరిస్తూ పరధర్మాలకు హాని కలుగకుండా పవిత్రమార్గంలో జీవించటం హిందూ సమాజంలో ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు..! దీనిని ఆటంక పరిచే ఏ చర్య అయినా అది నేరమే... రాగద్వేషాలకు లోను కాకుండా మనిషి తన ధర్మాన్ని నిర్వర్తించుకోమంటోంది గీతాశాస్త్రం... జీవితమంతా కర్మయోగమే...! ఐతే ఎంతమంచిదని భావించేదైనా ఎన్ని సుగుణాలు ఉన్నదనుకుంటున్నా. ఎంత చక్కగా ఆచరించబడుతున్నా పరధర్మాచరణం భయావహం... స్వధర్మమే అత్యుత్తమమైనది... ఆచరణీయమైనది. స్వధర్మాచరణమందు మరణించుటైనా శ్రేయస్కరమే...! అందువలన ఒక వ్యక్తిగా తను నమ్మిన ధర్మాన్ని అనుసరించటానికి... ఆధ్యాత్మిక మార్గంలో పయనించి తన మానవజన్మను స్మారకపరుచుకోవటానికి ఆటంకంగా ఉన్నా సంసారబంధం నుండి కామేశ్వరమ్మగారికి విముక్తి కలిగిస్తున్నాం. ఆమె కోరుకున్న విడాకులు మంజూరు చేస్తూ... భర్త ఆదాయాన్ననుసరించి నెలకు పది వేలు పరిహారం మంజూరు చేస్తోంది కోర్టు...!'

ధర్మాసనానికి తలవంచి నమస్కరించుకుని భుజాలనిండా నేతచీర చెరుగు కప్పుకొని... గుండెలనిండా స్వేచ్ఛావాయువు పీల్చుకుంటూ దేదీప్యమానంగా వెలిగిపోతున్న ముఖంతో ముందుకు వెళ్ళిపోతున్న భార్యను నిశ్చేష్టుడై చూస్తూ అట్టే ఉండిపోయాడు ఉమామహేశ్వరం.

**చినుకు సాహిత్య మాసపత్రికకు పంపే కథలు అచ్చులో 3 పేజీలకు మించకుండా పంపవలెను.**


కలర్ షాపీ
కోరమండల్ పెయింట్స్
ఎక్స్‌క్లూసివ్ షోరూమ్
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

శ్రీ సారథి పెయింట్స్
33-21-7, ఆంధ్రబ్యాంకు దగ్గర
ఏలూరు రోడ్డు, సీతారాంపురం, విజయవాడ - 4.
✆ 2432344